# ఐదవ ప్రసంగము.

తరువాతిరోజున శ్రీనిత్యానందస్వామివారు, శ్రీప్రకాశా నంద స్వామివారు, వైద్యరాజ గోపాలజీ కూర్చొనియుండిరి. శ్రీప్రకాశానందస్వామివారు అచ్చటినుండి 'జూనాగడ్' వెళ్ళవలసి యుండెను. ఆసమయమున, ఆయన మృణ్మయపాత్రిలో, అంతఃపురము నుండి ఒక సేవకుడు వచ్చి, కొన్ని రూపాయలను పడవేసెను. స్వామి వారు వెంటనే ఆపాత్రను బోర్లించి దానిలోనున్న రూపాయలను విసరివేసెను. ప్రక్కనున్న ఒకనితో నిట్లనెను:—

నా మట్టిపాత్ర మైలపడినది. కడిగి తీసికొనిరమ్ము. ఇది విని అందరు నవ్విరి.

## ద్రవ్యము నిషిద్ధము

గోపాలజీ:—స్వామీ! ద్రవ్యమును స్వీకరించుటలో అభ్యంతర మేమి?

స్వా॥ ప్ర॥ :—శాస్త్రమునందు నిషేధము కలదు.

గోపాల :—సన్యాసులు ద్రవ్యము స్వీకరించరాదని ఎందుకు నిషేధించబడినది.

స్వా॥ ప్ర॥ :—శాస్త్రమునందు సన్యాసులు మాత్రమే ధనము స్వీకరించరాదని లేదు. ముముక్షువు ఎవ్వడును స్వీకరించ రాదని చెప్పబడినది.

నచికేతునితో యమధర్మరాజు చెప్పెను:—

న సాంపరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యన్తం విత్తమోహేన మూఢమ్

"ధనమోహముచే మూఢుడయి, పొరబాట్లుచేయు బాలునకు (వివేకహీనునకు) పరమార్థమును సంపాదించు మార్గము తెలియదు."

## మృత్కాంచనములు సమానములు.

ఒక ముముక్షువగు బ్రాహ్మణుడు సన్యసించి, అరణ్యము లోనికి వెళ్లవలెనని నిశ్చయించెను. ఆనిశ్చయమును తనభార్యకు చెప్పెను. భార్యకూడా రాదలచెను. అప్పుడు ఆయన భార్యతో నిట్లనెను. సన్యాసికి భార్య దగ్గర ఉండరాదు. నీవునాతో రాకూడదు. భార్య వచ్చెదనని మిక్కిలి పట్టుబట్టినంతనే, 'నీకు మట్టియు బంగార మును రెండును సమానము అనుభావము కలిగినచో నీవు నాతో రావచ్చును' అని బ్రాహ్మణుడు చెప్పెను. భార్య "సరే" అనెను. భార్య కూడా ఉన్నందున ఆయన సన్యాసమునకు బదులు వాన ప్రస్థమును తీసికొనెను.

తమ సంపదనంతను త్యజించి వారు వనములోనికి వెళ్ళుటకు బయలుదేరిరి. త్రోవలో బ్రాహ్మణునకు ఒక స్వర్ణాలంకారము కన్పించెను. తన భార్య ఆ అలంకారమును చూచి మోహపాశము నకు లోనగునని తలచి కాలితో దుమ్మును త్రవ్వి ఆయన దానిని మరుగుపరచెను. కొంచెము దూరముగా వెనుకనుండి వచ్చుచున్న భార్య ఈ పనిని చూచెను. ముందుకు వెళ్ళుటకు శక్తి లేక అలసి నందున వారిరువురును ఒక చెట్టుక్రింద కూర్చొనిరి. కొంచెము విశ్రాంతి తీసికొనిన పిమ్మట భార్య భర్తను అడిగెను. త్రోవలో మీరు కాలితో ఏమి చేయుచుండిరి. బ్రాహ్మణుడు మొదట ఏమియు లేదని చెప్పెను. కాని భార్య పట్టుపట్టుటచే ఆయన చెప్పవలసి వచ్చెను. త్రోవలో ఒక బంగారునగ ఉండెను. నీవు చూచిన ఆశ పడెదవను భయముతో దానిని మట్టితో కప్పివేసితిని అని ఆయన చెప్పెను.

భార్య పలికెను:— బంగారమును, మట్టిని సమానదృష్టితో చూడవలెనని మీరు నాతో చెప్పిరికదా! మీకు ఇప్పుడు ఆ

భేదము ఎట్లు కన్పట్టెను? బంగారమును బంగారముగనే చూచుచున్నారే!

ఈమాటలతో ఆమెభర్త కండ్లు తెరచెను.

## ద్రవ్యము అనర్థకరము.

స్వా॥ ని॥ :—గురుమత్స్యేంద్రనాథుడు ఒకప్పుడు తనశిష్యుడు గోరకనాథునకు బంగారు ఇటుకను ఒకదానిని ఇచ్చెను. గోరక్ష నాథుడు ఆ ఇటుకను తీసుకొనివెళ్లి నూతిలో పడవేసెను. తరువాత ఆ గురు శిష్యులు ఆచోటు వదలి మరియొక ప్రదేశమునకు వెళ్లు చుండిరి. వెళ్ళుచు వెళ్ళుచు మార్గమధ్యమున వారుఒకచెట్టు క్రింద రాత్రి గడుపుటకుఆగిరి. గురుమత్స్యేంద్రనాథుడు అడిగెను. ఇక్కడ భయమేమియు లేదు కదా!

గోరఖనాథుడు చెప్పెను:—భయమును నూతిలో పారవేసితిని.

గోపాల:—ధనముచే భయముకలుగుట సత్యమే! కాని ధనము ఇతరులకు దాచ ఇచ్చిన భయమేమి?

స్వా॥ ప్రి॥ ఇతరులవద్ద ధనమును ఉంచిన తరువాత దానికి వడ్డీ పెంచవలె ననియు, అది ఏమగునో అనియు చింత కలుగును కదా!

భాగవతము ఏకాదశస్కంధమున భగవానుడు ఉద్ధవునితో చెప్పెను:—

*అర్థస్య సాధనే సిద్ధ ఉత్కర్షే రక్షణే వ్యయే।*
*నాశోపభోగ ఆయాసస్త్రాసశ్చింతా భ్రమో నృణామ్ ॥*

“ధనమును సంపాదించుటలో నిమగ్నులయినవారు దాని అభివృద్ధి, రక్షణ, వ్యయము, నాశము, అనుభవము మొదలయిన వాటియందు క్లేశము, త్రాసము, చింత, భ్రమ అనువానిని పొందెదరు.”

*స్తేయం హింసాఽనృతం దమ్భః కామః క్రోధః స్మయో మదః ।*
*భేదో వైరం న విశ్వాసః సంస్పర్ధా వ్యసనాని చ ॥*
*ఏతే పఞ్చదశానర్థా హ్యర్థమూలా మతా నృణామ్ ।*
*తస్మాదర్థమనర్థాఖ్యం శ్రేయోఽర్థీ దూరతః త్యజేత్ ॥*

"దొంగతనము, హింస, అసత్యము, దంభము, కామము, క్రోధము, దర్పము, మదము, కపటము, వైరము, అవిశ్వాసము, స్పర్థ, వ్యసనములు అనగా ద్యూతము, వ్యభిచారము, సురాపానము అనునవి—ఈ పదునైదు అనర్థములు మానవులకు అర్థముచే కలుగును. కావున కళ్యాణమును కోరు మానవుడు ద్రవ్యము అనర్థ కరమని తెలిసికొని దూరమునుండియే త్యజించవలెను."

గోపాల:—ధనమును తమరు స్వార్థమునకై ఉపయోగించక పోయిన మానుడు. కాని దానిని సద్వినియోగ మయేట్లుగా ఉప యోగించుటలో తప్పేమి? ఈరోజులలో దారిద్ర్యము పెరిగిపోవు చున్నది. బీదవారికొరకు ధనమును పోగుచేసి అడిగిన తరువాతనైన ధర్మము చేయవలెను కదా!

స్వా॥ ప్రి॥ :—మహాభారతమున ఇట్లున్నది—

*ధర్మార్థం యస్య విత్తేహా వరం తస్య నిరీహతా ।*
*ప్రక్షాలనాద్ధి పఙ్కస్య శ్రేయో హ్యస్పర్శనం వరమ్ ॥*

"ధర్మముచేయుటకొరకు ధనమును కోరువాడు ధనమును కోరకుండుటయే మంచిది. అడుసు త్రొక్కి కాలు కడుగుకొనుట కంటె త్రొక్కకుండుటయే శ్రేష్ఠముకదా!"

స్వా॥ ని॥ :—ఇతరుల ధనమును తీసికొని ధర్మకార్యములు చేయుట పాపపని. హరిద్వారము మొదలగు పుణ్యక్షేత్రములలో కుంభోత్సవమున లక్షలకొలది జనులు పాల్గొనుదురు. అచ్చట పెద్ద పెద్ద విందులు జరుగును కదా! భోజనానంతరము ఎంగిళ్ళలోనుంచి

పాకీమనుష్యులు మిగిలిన పదార్థములను వేరుచేసి తమ పైఅధికారి చెంతకు తీసికొని పోవుదురు. పైఅధికారి వానిలోనుంచి ఫలానా మనిషికి ఫలానా వస్తువు ఇవ్వవలెనని నిర్ణయించును. అడిగిన, ద్రవ్యమును ధర్మకార్యములకు వినియోగించుట, అంతకంటె మరియొకవిధమైనది కాదు.

స్వా॥ ప్రె॥ :—అడిగిన, ధనమును ధర్మకార్యములయందు వినియోగించుటయే కాదు, అపరిపక్వవయస్సునందు వారసత్వముగా లభించిన ధనమును ధర్మకార్యములకు వినియోగించుటకూడ నిషిద్ధమే.

ఈవిషయమున ఒకమహమ్మదీయ మహాత్ముని ఉపదేశమును గ్రహింపవలెను :—

ఒకరోజున ఒకబాలకుడు మహాత్ముడగు 'జుజున'వద్దకు వచ్చి అడిగెను.

"వారసత్వముక్రింద నాకు లక్షునాణెములు లభించినవి. ఆధనమంతయు నేను తమకు దానము చేయుచున్నాను."

జుజున:—నీ వయస్సు 21 సంవత్సరములు ఉన్నదా?

బా:—లేదండీ.

జుజున:—అయితే ఇంకా నీకు దానముచేయు అధికారము లేదు. యుక్తవయస్సు వచ్చువరకు ధైర్యము కలిగియుండుము.

కాలాంతరమున బాలుడు యుక్తవయస్సును పొంది ఆమహాత్మునకు శిష్యుడయ్యెను. తన సంపదనంతను ఫకీరులకు పంచి ఇచ్చెను. తన దగ్గర ఒక పైసకూడ ఉంచుకొనలేదు. కొంతకాలమైనతరువాత అతడు ఫకీరులవద్దకు వచ్చి చూచెను. వారివద్ద ఏమియు మిగలలేదు. అప్పుడతడు విచారించెను. అయ్యో! ఇప్పుడు నాదగ్గర మరి ధనము లేదు కదా! ఇంకను లక్షునాణెములు ఉన్నచో వీరందరకును ఇచ్చి ఉండెడివాడనే!

## తపశ్శాలుర యథార్థ ధనము.

ఈమాటలు విని జుజున ఈయువకునకు ఇంకను ధనమునందు కోరిక తీరలేదనియు, సరియగు ధర్మమార్గమున ఇతడు నడచుట లేదనియు తెలిసికొనెను. సాంసారిక ద్రవ్యములు ఎక్కువ విలువ కలవి అను మోహమును పోగొట్టుటకు ఆమహాత్ముడు యువకునితో నిట్లనెను:—

"నీవు కిరాణావర్తకుని చెంతకు వెళ్లి మూడు తులములు ఫలానా మూలిక తీసికొని రమ్ము."

యువకుడు అట్లు చేసెను.

జుజున:—"ఈఓషధిని చూర్ణముచేసి నూనె కలిపి మూడు మాత్రలు చేయుము. తరువాత వానికి సూదితో రంధ్రములు చేసి నాదగ్గరకు తీసికొనిరమ్ము. యువకుడు అట్లుచేసిన తరువాత ఆమహాత్ముడు తన చేతియందుంచుకొని వానిని ఊది తనమంత్రమహిమతో మాణిక్యములుగా మార్చెను. అంతట వానిని యువకునకు ఇచ్చి బజారులో వీని విలువ తెలిసికొని రమ్ము అని పలికెను.

బజారులో నగల వర్తకులు వానివిలువ ఒక్కొక్క లక్ష నాణెములని చెప్పిరి. ఆతడు వచ్చి ఆమహాత్మునకు ఆసంగతి నివేదించెను.

మహాత్ముడు ఇట్లు చెప్పెను:—ఇక ఈ మూడు మాత్రలను గుండచేసి నీటిలో పారవేయుము. తపశ్శీలురమగు మేమందరము ధనము లేనందున ఏల విచారించుటలేదో తెలిసికొనుము. తపశ్శీలురకు ద్రవ్యముద్వారా స్వేచ్ఛగా నుండుకోరిక ఉండదు. వారికి తపము, ధర్మము అను ధనమును సంపాదించవలెననుకోరికమాత్రమే యుండును,

## బ్రహ్మవిద్యాప్రాప్తికి కాంతాకనకములు విఘ్నములు.

బ్రహ్మవిద్యను పొందుటకు దగ్గరమార్గము తనకొరకుకాని, ఇతరులకొరకుకాని ధనమును సంపాదించుట తప్పు అని నమ్ముటయే. కనకముకంటె కాంత ఎక్కువ విఘ్నము. ప్రపంచ మంతటయందును ఎక్కువ మోహమును ఉద్భవింపజేయునది స్త్రీ. స్త్రీ ఉన్నవానికే ద్రవ్యమునందు కోరిక కలుగును. స్త్రీ లేనివానికి ద్రవ్యాపేక్ష ఉండదు.

*అసారే ఖలు సంసారే సారం సారఙ్గలోచనాః।*
*తదర్థం ధనమిచ్ఛన్తి తత్త్యాగేన ధనేన కిమ్॥*

"సారములేని సంసారములో స్త్రీలే సారపదార్థములు. మనుష్యులు వారికొరకే ధనమును వాంఛించెదరు. స్త్రీని త్యజించినవానికి ధనముతో ప్రయోజనమేమి? స్త్రీతో పాణిగ్రహణము చేసినంత మాత్రమున ఇల్లు, భూమి, బండి, గుర్రము, మొదలగువస్తువులు అడుగడుగున కావలెను. ధనము బంధకారణము. కావున స్త్రీని త్యజించి సన్యాసదీక్ష తీసికొనిన తరువాత ధనము కావలసిన అవసర మేమియు ఉండదు. కావున స్త్రీయందు కోరికను విడనాడవలెను. స్త్రీయందు మోహమును పోగొట్టుటకు స్త్రీయందు దోషదృష్టి కలిగి యుండుట ఉపాయము. దీనికొక దృష్టాంతము కలదు.

ఒక రాజకుమారుడు ఒకమారు వేటకు వెళ్లెను. అతడు నది తటమున తన మనుష్యులతోకూడ వెళ్ళుచుండెను. అచ్చట ఒక వణిక్పుత్రిక ఇరుప్రక్కల తెరవేసికొని స్నానము చేయుచుండెను. రాకుమారుడు అశ్వారూఢుడై యున్నందున తెరలోనున్న వణిక్పుత్రికను పైనుంచి చూచెను. ఆమెసౌందర్యమును చూచి అతడు ముగ్ధుడయి వెంటనే సంతోషమును విడనాడి శోకసముద్రమున మునిగిపోయెను. వివరములు తెలిసికొనగా ఆమె తననగరమునందలి శ్రేష్ఠి

కుమార్తె అని తెలిసెను. ఇది తెలిసినతరువాత ఆతని దుఃఖము పెరిగి పోయెను. నిద్రాహారములు మానివేసెను. శరీరము రోజురోజుకు శుష్కించసాగెను. కుమారుని పరిస్థితి చూచి తండ్రి చాల కంగారు పడెను. స్నేహితులద్వారా తన కుమారుని దుఃఖముయొక్క యథార్థ వృత్తాంతమును తెలిసికొనెను. అంతట ఆశ్రేష్ఠిని పిలచి అతని కుమార్తెను తన కుమారునికిచ్చి వివాహము చేయుమని ఆజ్ఞాపించెను. "తమరు క్షత్రియులు, నేను వైశ్యుడను. నా కుమార్తెను మీ కుమారునకు ఇచ్చుట ఎట్లు?" అని శ్రేష్ఠి అనెను.

అతడు ఎన్ని చెప్పినను రాజు అంగీకరించలేదు. 'ఏడు రోజుల లోపుగా పెండ్లి చేయకపోయినచో బలవంతముగా చేయవలసి వచ్చును.' అని రాజు అతనితో చెప్పెను. ఇంటికి వెళ్ళి శ్రేష్ఠి దుఃఖించసాగెను. ఎవరికిని ఈసంగతి తెలియదు. తండ్రిగారి పరిస్థితిని చూచి కుమార్తె చాల చింతించుచు సంగతేమని ఆయనను ప్రశ్నించెను. చాల పట్టుదలతో అడిగిన పిమ్మట తండ్రి కుమార్తెకు సంగతి అంతయు చెప్పెను. కుమార్తె నవ్వుచు ఇట్లనెను:—దీనికి మీరు కంగారు పడవలసిన అవసర మేమి? వెళ్ళి రాజుగారితో వివాహమునకు ఒకరోజు ముందు నేను వారి కుమారుని ఏకాంతమున కలసికొన గోరుచున్నానని చెప్పండి. శ్రేష్ఠి వెళ్లి రాజునకు ఈసంగతి తెలిపెను. వణిక్పుత్రిక వృద్ధవైద్యుని పిలిపించి పలికెను:—

"ఏడు రోజులకును నాకు విరేచన ఔషధములు కావలెను. శరీరమునుండి రక్త మాంసములు మొదలగునవి మలరూపమున బయటకు పోవలెను. కేవలము ఎముకల పోగుమాత్రము మిగలవలెను."

ఆ ఔషధముచే తాను విసర్జించిన మలము నంతను వేరువేరు పాత్రములయందు నింపి యుంచెను, తన అభీష్టము ననుసరించి ఆమె

చాల దుర్బలురాలు అయ్యెను. ఎముకలును, చర్మము మాత్రమే కన్పించెను.

అటు రాజపుత్రుడు వణిక్పుత్రికకొరకు కలలు కనుచుండెను. ఆమె ఏడురోజులు పూర్తి అయినతరువాత మలపాత్రములను ముఖమలువస్త్రములతో నింపి సేవకులతో పట్టించుకొని తాను పల్లకీలో కూర్చొని బయలుదేరెను. తాను నిర్ణయించిన ప్రదేశమున ఆమె రాజకుమారునికొరకు ఎదురు చూచుచుండెను. రాజకుమారుడు వచ్చి ఆమె ఏభూతమో, ప్రేతమో అను భయముతో హడలిపోయెను.

వణిక్పుత్రిక:—"అట్లు భయపడుచున్నారేమి? వణిక్పుత్రికపై తాము ముగ్ధులయిరి కదా! ఆమె నేనే!"

రా. కు. :—"ఆమె మహాసౌందర్యవతి. నీవు ఇంత భయంకరముగా నున్నావేమి?"

వణి. :—ఆమె నేనే. భయపడకండి. దగ్గరకు రండి. నేను నాసౌందర్యమును బయటకు తీసి ప్రక్కను ఉంచితిని. అందుచేతనే నాస్థితి ఇట్లు అయినది.

రా. కు. :—సౌందర్యము బయటికి తీసి దూరముగా నుంచుటదార్థమా!

వస్త్రాలు, భూషణములు, అలంకారాదులు శరీరముపై నుండి తీసి ప్రక్కను పెట్టవచ్చును. కాని సౌందర్యము ప్రక్కను ఎట్లు పెట్టవచ్చును?

వణి. :—ఈ ముఖమలువస్త్రములచే కప్పబడిన పాత్రములయందు నా సౌందర్యము కలదు. తమకొరకు ఎదురు చూచుచున్నది.

రాకుమారుడు వస్త్రములను తప్పించుట తోడనే వచ్చిన దుర్గంధముతో ముక్కు మూసుకొని దూరముగా తొలగెను.

వణి.:—అట్లు తొలగిపోవుచున్నారేమి! అదియే నా సౌందర్యము.

రా॥ కు॥ :—అది యెట్లు?

వ॥ పు॥: —అన్నాదులు భుజించుటచే ఈ శరీరమున రక్తమాంసాదులు ఉద్భవించును. వానిచే శరీరము సుందరముగా కన్పించును. ఏడురోజులకు పూర్వము ఇది నాశరీరమునందు ఉండి నాశరీరమునకు సౌందర్యము నిచ్చి దానియందు మోహమును కలిగించెడిది. నేడు బయటకువచ్చి దుర్గంధభూయిష్ఠముగ నున్నది. ఈ అస్థి, మాంస, క్రిమి, మల, మూత్రాదులతో నిండిన శరీరముపై మోహమును పొందుట మీవంటి విజ్ఞులకు ఉచితము కాదు."

వణిక్పుత్రిక చెప్పిన ఈ వాక్యములను వినినంతనే రాజపుత్రుని స్త్రీమోహము తొలగిపోయెను. స్త్రీయందు విరక్తి జనించుటచే అతడు తీవ్రవైరాగ్యము కలిగి ప్రపంచము నంతను త్యజించి అరణ్యములోనికి వెళ్ళిపోయెను. ధర్మపరాయణుడయి గురువుద్వారా జ్ఞానమును సంపాదించి బ్రహ్మానుభవమును పొందెను.

విషయసుఖమును కలిగించు వాసనలయందు గ్లాని కలిగినతోడనే అవి నిస్సారముగా తోచును. అంతట తీవ్రవైరాగ్యము కలుగును—అని పై దృష్టాంతమును బట్టి తెలియుచున్నది.

కామవాసనను పోగొట్టుట అన్నివాసనలకంటెను కష్టము. కామినీకాంచనములయందు కోరిక నశించినచో ముక్తిరూపరాజధానిలో ప్రవేశించుయోగ్యత కలుగును. శంకరుల వాక్యము వినుడు:—

*ముక్తిశ్రీనగరస్య దుర్జయతరం ద్వారం యదస్త్యాదిమం*
*తస్యే ద్వే అరరే ధనం చ యువతిస్తాభ్యాం పినద్ధం దృఢమ్*
*కామాఖ్యార్గలదారుణా బలవతా ద్వారం తదేతత్త్రయం*
*ధీరో యస్తు భినత్తి సోఽర్హతి సుఖం భోక్తుం విముక్తిశ్రియః ॥*

"ముక్తి అను సంపత్తినగరముయొక్క మొదటిద్వారము మిక్కిలి జయించ శక్యముకానిది. దానికి ధనము, భార్య అను

రెండు తలుపులు కలవు. ఆద్వారమునకు బలవత్తరమగు కోరిక అను గడియ వేయబడియున్నది. ఈ మూడు వస్తువులను భేదించిన ధీరుడు మాత్రమే ఆ ముక్తిశ్రీసుఖమును అనుభవించుటకు యోగ్యుడు." స్త్రీధనాదులు బ్రహ్మవిద్యామార్గమునందవి విఘ్నములు. కావున వానికి దూరముగా నుండవలెను.

## యోగారూఢుడు.

గోపాల:—సన్యాసికి ధనాదులు విఘ్నములే. కాని ఆరూఢునకు ఆ పదార్థములు విఘ్నములగుట ఎట్లు?

స్వా॥ ప్ర॥:—ఆరూఢునకు ఇవి విఘ్నము కావనుమాట సత్యము. గీతలో భగవానుడు కూడ చెప్పెను:—

*జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః ।*
*యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః ॥*

"జ్ఞానవిజ్ఞానములచే తృప్తిని పొంది, వికారరహితుడగు జితేంద్రియుడు మట్టిబెడ్డ, రాయి, ఇనుము—అన్నిటిని సమానముగా చూచును. అతడు యోగారూఢుడు."

బంగారము, మట్టి రెండును సమానమనుకొను జ్ఞాని దానిని తీసికొనుట ఎట్లు?

## జ్ఞాని ఎదుట మాయ నిర్వీర్యము.

గోపాల:—కొందరు స్వాములు ఇట్లు చెప్పెదరు:—

*దణ్డగ్రహణమాత్రేణ నరో నారాయణో భవేత్ ।*
*ప్రైషోచ్చారణమాత్రేణ నరో నారాయణో భవేత్ ॥*

"దండమును గ్రహించి ప్రైషమంత్రమును ఉచ్చరించినంత మాత్రమున నరుడు నారాయణుడగును." నారాయణుడు ఉన్నచోటికి తనంతట తానే లక్ష్మి వచ్చివేయును. లక్ష్మి వచ్చి కాళ్ళమీద పడినచో ఆలక్ష్మిని తిరస్కరించుట ఎట్లు?

స్వా॥ ప్ర॥ :—లక్ష్మి అనగా ఇక్కడ మోక్షలక్ష్మి అని అర్థము గ్రహించవలెను. పూర్ణవైరాగ్యము కలవాడు సన్యాసమును తీసికొనినతరువాత జ్ఞానముద్వారా మోక్షలక్ష్మిని సంపాదించును. ధనాదిరూపమైన లక్ష్మిని కాదు. ఏలనన,మాయికమగు లక్ష్మి సన్యాసి ఎదుట నిలబడి ఉండలేదు.

ఈవిషయమున సాంఖ్యశాస్త్రమునందిట్లు చెప్పబడినది.

*దోషబోధేఽపి నోపసర్పణం ప్రధానస్య కులవధూవత్ ॥*

"కులస్త్రీ తనయందలి దోషము భర్తకు తెలిసినతరువాత భర్త చెంతకు చేరలేదు. అటులనే మాయకూడ దోషమును తెలిసికొనిన జ్ఞానిదగ్గరకు వెళ్ళలేదు."

ఒక నగరమున నగరశ్రేష్ఠి ఉండెడివాడు. అతనికి గొప్ప గౌరవము కలదు. ఆతనికి ఒక కుమారుడు కలడు. అతడు చాల గొప్పవాడు. సచ్ఛీలుడు. కులప్రతిష్ఠను కాపాడుటయందు నిమగ్నుడై యుండెడివాడు. తల్లిదండ్రులు ఆతనికి ఒక సుందరితో వివాహము జేసిరి. అటుతరువాత రెండు మూడు సంవత్సరములకు శ్రేష్ఠియును, ఆతని భార్యయున్న ఇరువురును కాలధర్మమును చెందిరి.

శ్రేష్ఠికోడలు చాల తెలివైనది. అవినీతిపరురాలైనను తన తెలివితేటలతో భర్తమనస్సును ఆమె జయించెను. ఆమె మహాపతివ్రత అని భర్తకు నమ్మకము కలిగెను. భార్యను నమ్మరాదు అను సంగతి భర్తకు తెలియదు. కాని అతని మిత్రుడు ఆమె కుటిల ప్రవర్తనను తెలిసికొనెను. నగరశ్రేష్ఠి కోడలుగురించి నగరమంతయు ప్రచారమయ్యెను. శ్రేష్ఠికుమారుని మిత్రులు భార్యను జాగ్రత్తలో నుంచమని ఆతనితో చెప్పిరి.

మిత్రులమాటలు విని శ్రేష్ఠికుమారుడు చాల క్రుద్ధుడయ్యెను. ఆతడిట్లనెను:— ప్రపంచములో నాభార్యవంటి పతివ్రత మరియొకతె

లేదు. మిత్రులందరును ఊరకుండిరి. నాలుగైదు మాసముల తరువాత మిత్రులు మరల ఆమాటయే చెప్పుటచే అతడు ఈసారి కోపము చెందక నెమ్మదిగా మెత్తపడి ఇట్లనెను. మీరు ఇట్టి తప్పుడుమాట చెప్పుచున్నారేమి! కంటితో చూచినను, అది ఒకప్పుడు తప్పుకాదు కదా! ఇతరులపై తప్పుడు ఆరోపణలు చేయరాదు. ఇదివిని మిత్రులందరు మరల ఊరుకొనిరి. మరల కొన్నిమాసములు గడచినవి. మిత్రులకు తమ మిత్రునిభార్యయొక్క చెడునడత నచ్చలేదు. వారు తమ మిత్రునికళ్ళు తప్పక తెరువవలెనని నిశ్చయించిరి. మరియొక రెండు మూడు మాసముల తరువాత ఆతనితో వారు పలికిరి:—

సోదరా! నీకు ఏమిచెప్పినను మాహృదయములో నున్నది దాచక చెప్పవలెను కదా! నీగౌరవము పోవుట చూడలేకపోవుచున్నాము.

శ్రే॥ కు॥ :—మీరు కండ్లతో చూచిరా!

మిత్రు॥ :—మేము చూచితిమి? నీకు చూపించమందువా?

శ్రే॥ కు॥ :—కండ్లతో చూచిన నిజమని ఒప్పుకొనవలసినదే!

మిత్రు॥ :—రేపు వ్యాపారము నిమిత్తము ఊరికి వెళ్ళుచున్నాను, ఎల్లుండి తిరిగి వచ్చెదనని నీభార్యతో చెప్పుము. అట్లు చెప్పి మాయింటికి వచ్చి దాగియుండుము. నీకండ్లార చూడగలవు.

శ్రేష్ఠికుమారుడు మిత్రులు చెప్పిన ప్రకారము చేసెను. తరువాతిరోజున ఉదయము భోజనముచేసి ఆతడు ఇంటినుండి బయలుదేరెను. అతడు మిత్రుని ఇంటికి వెళ్ళెను. అంతట ఆతనిభార్య తన ప్రియునకు భర్త ఊరికివెళ్ళెనని నౌకరుద్వారా వర్తమానము పంపెను. ఆమె ఆతనిని భోజనమునకు పిలచెను. వార్త అందినవెంటనే ఆతడు అచటికి వచ్చెను. భోజనముచేసి ఉభయులు మేడమీంద ఆనందము ననుభవించుచుండిరి. మిత్రులు శ్రేష్ఠికుమారుని వెనుక

నుంచి నిచ్చెనవేసి మేడపైకి ఎక్కించిరి. భార్యాభర్తలు ఒండొరులను చూచుకొనిరి. ఈజీవితములో ఈస్త్రీని చూడరాదని అతడు నిశ్చయించుకొనెను. భార్యకూడ ఇట్లనుకొనెను. ఇంతవరకు పతివ్రతగా కనబట్టుచు గొప్పదంభమును చూపుచుండెడి దానను. ఇప్పుడు భర్తముఖము ఎట్లుచూడగలను? ఇట్లనుకొని ఆమెకూడ అక్కడనుండి పారిపోయెను. సదసద్వివేకము, వైరాగ్యమును కల వ్యక్తి ఎదుట మాయయు, మాయాకార్యములును, నిలబడి యుండ లేవు. జ్ఞాని ఎట్లుండ వలెను అను విషయమున కబీరు వాక్యములను వినుడు :—

మాయా నాసీ సంతకీ సాకుం థకీ సిరతాజ్
సాకుం థకీ షిర మానినీ సంతోషే అతిలాజ్.

జ్ఞానిఎదుట మాయ సిగ్గుపడును. మాయ వ్యభిచారిణివంటిది, వ్యభిచారిణి జారునియెదుట నిలబడునుగాని సాధువెదుట నిలబడ లేదు. అటులనే మాయ సత్పురుషునిఎదుట నిలబడలేదు. అటులనే తత్త్వవేత్తచెంతకూడ ఆమె నిలబడలేదు. విషయములయందు దోషములనుచూచు వైరాగ్యవంతుడగు జిజ్ఞాసువు ఎదుటనే మాయ నిలబడలేదు. ఇక జ్ఞానిఎదుట మాయ ఎట్లు నిలబడి ఉండగలదు?

గోపాల:—సన్న్యాసమును స్వీకరించుట ఎందుకు?

స్వా॥ ప్ర॥ :—జ్ఞానమునకు రెండు సాధనములు కలవు. వైరాగ్యము, ఉపరతి.

*తత్త్వబోధః ప్రధానం స్యాత్ సాక్షాన్మోక్షప్రదత్వతః ।*
*బోధోపకారిణావేతౌ వైరాగ్యోపరమావుభౌ ॥ (పంచదశి)*

తత్త్వజ్ఞానము సాక్షాత్తు మోక్షమును ఇచ్చును. అందుచే అది ముఖ్యము. వైరాగ్యము, ఉపరతి రెండును తత్త్వజ్ఞానమునకు సహాయము చేయును.

గృహస్థాశ్రమమున వైరాగ్యమును పాలించిన పాలించగల మేమో! అనగా ఆహారవిహారాదులయందు సంయమమును పూరిగా పాటించిన పాటించగలమేమో కాని ఉపరతి అసంభవము.

ఉపరతి అనగా ధనాది మాయికపదార్థముల బాహ్యత్యాగము.

ఏతం వై తమాత్మానం విదిత్వా బ్రాహ్మణాః పుత్రైషణాయాశ్చ
విత్తైషణాయాశ్చ లోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి॥
(బృహదారణ్యకం)

"ప్రసిద్ధమగు ఆ ఆత్మను పరోక్షముగా తెలిసికొని అపరోక్షముగా తెలిసికొనుటకు బ్రాహ్మణులు పుత్రేచ్ఛను, ధనేచ్ఛను, కీర్తియందు ఇచ్ఛను, త్యజించి భిక్షకొరకు తిరిగెదరు."

గోపా. :—పూర్వము ముముక్షువులు ధనాది మాయిక పదార్థములను త్యజించి జ్ఞానముకొరకు సన్యాసమును తీసికొనెడివారు. ఈరోజులలో ఎవడును జ్ఞానముకొరకు సన్యసించుట లేదు. పైగా ధనాది మాయిక పదార్థములను సంగ్రహించుటకు సన్యసించుచున్నారు.

స్వా॥ ని॥ :—ఈ దర్బారులోనికి వచ్చు సన్యాసులు అందరును ద్రవ్యాదులు కోరుటకు మాత్రమే వచ్చెదరు. అట్టి స్వాములను తమరు దూయబట్టుచున్నారు.

గోపా. :—మా గృహస్థాశ్రమములోనివారికి ఎంత ధనమోహమున్నదో అంతకంటె హెచ్చుగా సన్యాసులలో అది చూడనగును.

స్వా॥ ప్ర॥ :—(వినోదప్రాయముగా) బృహన్నారదీయ పురాణములోని కలియుగవర్ణనమున వ్రాయబడినది.

బ్రాహ్మణాః ద్రవ్యలోలుపాః:—కలియుగమందలి బ్రాహ్మణులు ద్రవ్యమునందు ఆశ కలవారు, అటులనే భాగవతమునందలి కలి

యుగ ప్రసంగమునకూడ "స్యాసినో౽త్యర్థలోలుపాః" అని చెప్పబడి నది. సన్యాసులు మిక్కిలి ద్రవ్యలోలుపులు. అట్లు మీగృహస్థులు "బైరాగీ" మేము "బేరాగీ" అనగా మీకంటె రెట్టింపు రాగము మాకు కలదు (అని చమత్కరించిరి). ఇది విని అందరు నవ్వసాగిరి.

గోపా॥:—అందరు సన్యాసులును అట్టివారుకారు. సన్యాసులయి ఆశ్రమధర్మములను పాటించకపోయినచో పతితులగుట జరుగును.

## గృహస్థుని ధర్మములు

స్వా॥ ప్ర॥:—మీరు సన్యాసులను నిందించుచున్నారు. ఇతర సంప్రదాయములవారు, సాధువులు ఉండుటకు ఆశ్రమములు కట్టించిరి. అన్నవస్త్రములకు ఏర్పాట్లుచేసిరి. సాధువులు చదువుకొనదలచినచో అందుకు వీలగు పరిస్థితులను సృష్టించిరి. చాలధనము వెచ్చించి పండితులను విద్యనేర్పుటకు నియమించిరి. గ్రంథాదులకొరకు వేలకొలది ధనము వెచ్చించిరి. సన్యాసులకొరకు మీబ్రాహ్మణులు ఏమైనా ఏర్పాట్లు చేశారా? కేవలము విమర్శించుట మాత్రమే నేర్చుకొనిరా? సన్యాసికి అన్నవస్త్రములు లభించుటకు ఎంత కష్టపడ వలసివచ్చునో నాకు బాగుగా తెలియును. మీ గృహస్థాశ్రమ ధర్మములేమిటో మీకు తెలియునా?

పూర్వము ఒక రాజు ఉండెను. తన రాజ్యములోనికి వచ్చిన ప్రతిసన్యాసిని గృహస్థాశ్రమము గొప్పదియా, సన్యాసాశ్రమము గొప్పదియా అని అడిగెడివాడు. "గృహస్థాశ్రమము" అని ఆ సన్యాసి చెప్పినచో బలవంతముగా ఆతని కాషాయాంబరాదులు విప్పించి పెండ్లిచేయించి జీవితము గడపుకొనుటకు వలయు సదుపాయ ములు చేసెడివాడు. "సన్యాసాశ్రమమే గొప్పది" అని ఆ సన్యాసి చెప్పిన, ప్రమాణమేమని అడిగెడివాడు. సరియగు సమాధానము ఇయ్యలేకపోయినచో ఆసన్యాసికికూడ బలాత్కారముగా పెండ్లి చేయించి జీవనోపాధి కల్పించెడివాడు,

ఇట్లు కొంతకాలము గడిచినతరువాత ఒక సన్యాసి అక్కడకు వచ్చెను. అతనినికూడ రాజు పైరీతిగా ప్రశ్నించెను. "యథార్థముగా పాటించినచో రెండు ఆశ్రమములును గొప్పవే" అని ఆతడు సమాధానము చెప్పెను.

రాజు ప్రమాణమేమని ప్రశ్నించెను. "దీనిని ప్రత్యక్షముగ చూడదలచినచో నాతో రండు. చూపించెదను." అని ఆతడు సమాధానము చెప్పెను. రాజు అంగీకరించి సన్యాసిని అనుసరించెను. వారు చాలదూరము వెళ్ళిరి. అది మరియొక రాజ్యము. రాజు కుమారుడు లేకుండ చనిపోయెను కుమార్తె మాత్రమే యుండెను. ఆ రాజు చనిపోవు సమయమున మాపట్టపుఏనుగు ఎవనిపై ఉదకుంభమును అభిషేకించునో ఆతనికి నాకన్యను, రాజ్యమును ఇచ్చుచున్నాను అని చెప్పి మంత్రికి అమలుచేయ నాజ్ఞయిచ్చెను. ఆవిధముగా ఒక సుముహూర్తము నిర్ణయించబడెను. చాలమంది వచ్చిరి. కాని ఏనుగు దూరమున ఉన్న ఒక యువక సన్యాసిపై ఉదకుంభమును అభిషేకించెను. సన్యాసి ఒక్కమారు వెనుకకు తగ్గెను. ఆతనిని ఆపి రాజకన్యయు ప్రధానియు నచ్చచెప్పుటకు ప్రయత్నించిరి.

ప్రధాని చెప్పెను:—తమరు వివాహముచేసికొని నివృత్తి మార్గమున ఇచ్చటనే ఉండుడు. రాజ్యభారము అంతయు నేను వహించెదను. మీకు ఏవిధమైన ఉపాధియు ఉండదు. ఇట్లు ఎంత చెప్పినను ఆతడు అంగీకరించక అచ్చటినుండి వెడలిపోయెను. ఇది అంతయు మొదటి సన్యాసియును, రాజును అచ్చటనే ఉండి చూచుచు ఉండిరి. వారు కూడ ఆసన్యాసిని వెంబడించిరి. ఒక పెద్ద వృక్షముక్రింద వారు ముగ్గురును కూర్చొనిరి. ఇంతలో చీకటిపడెను. శిశిరఋతువు అయినందున చలి బాగుగా వేయుచుండెను. ఆ వృక్షముపై ఒక పక్షికుటుంబము ఉండెను. అవి తమసమీపమున ముగ్గురును చలితో బాధపడుచుండుట చూచెను. ఆ పక్షులు అరణ్యములో

నుండి పుల్లలు తెచ్చి నిప్పును అంటించెను. ముగ్గురు మానవులకు దేవుడు సహాయము చేసినట్లు తోచి ప్రక్కనున్న ఎండు పుల్లలనుచేర్చి వారు చలిని తీర్చుకొనిరి. అతిథులకు క్షుధానివృత్తి కలుగజేయవలెనను తలంపుతో మగపక్షి నిప్పులో పడెను. భర్త శరీరముతో వారి క్షుధానివృత్తి కాదని తలచి భర్తను భార్యకూడ అనుసరించెను. పిల్ల పక్షులు తల్లిదండ్రులను అనుగమించినవి. ఇది చూచి మొదటి సన్యాసితో రాజు చెప్పెను:—"సరిగా నిర్వహించినచో రెండును శ్రేష్ఠమే. తటస్థుడగు ఈసన్యాసి రాజకన్యను, రాజ్యమును కూడ త్యజించి సన్యాసాశ్రమమును పాలించెను. వృక్షముపైనున్న పక్షులు తమ గృహస్థాశ్రమమును పాలించినవి. అతిథిసత్కారమునకు ఉత్తమమగు త్యాగమును చేసి గృహస్థాశ్రమమును దీపింపజేసినవి. కావున సక్రమముగ నిర్వహించిన రెండును శ్రేష్ఠమే.

మా సన్యాసులు ఆశ్రమధర్మములు పాలించకుండుటకు ప్రధానదోషము మీది. పూర్వము ఋషులును, మునులును సంతానమునకు మాత్రమే వివాహము చేసికొని సంతానము కలిగినతరువాత సంయమములో నుండెడివారు. ఆశ్రమధర్మములను పూర్తిగా పాలించెడివారు. వారి ప్రజలుకూడ బుద్ధిమంతులు, వైరాగ్యముకలవారు అయి ఉండెడివారు. ఆప్రజలలోనుండి వచ్చిన సన్యాసులు ఆశ్రమధర్మనిర్వహణలో లోపములను చేసెడివారు కారు. జ్ఞానముద్వారా మోక్షము పొందుచుండెడివారు. ఇప్పుడు గృహస్థులగు మీరు విలాసపరులు అయిపోయిరి. మేముకూడ ఇష్టము వచ్చినట్లు సంచరించుచున్నాము.

ఇది విని శ్రీనిత్యానందులవారు వైద్యరాజగోపాలజీతో నవ్వుచు ఇట్లనిరి:—నేడు స్వామివారు మిమ్ములను బాగుగా బోల్తాకొట్టించిరి. ఇంక వారికి సమాధానము చెప్పుడు.

—0—